
https://www.sreechakranews.com

# శ్రీచక్ర


SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 71 | కర్నూలు | ఆదివారం 19-04-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi




మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్స్క్రైబ్, లైక్.



# మూడుసార్లు గోదావరి పుష్కరాలు నిర్వహించే అదృష్టం

**పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం**

**రాజధాని అమరావతి రైతుల త్యాగం మరువలేనిది**

**రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోంది**

**మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు**




నిడదవోలు,ఏప్రిల్18 (శ్రీచక్ర) : గోదావరి పుష్కరాలను వచయ్యే యేడు బ్రహ్మాండంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అప్పటిలోగా పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. గోదావరి పుష్కరాలను మూడోసారి నిర్వహించే అదృష్టం తనకే దక్కిందని అన్నారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో, 2024లో వచ్చిన మెజార్టీ ఎప్పుడూ చూడలేదని ప్రస్తావించారు. తెలిపారు. అమరావతి రాజధానిగా కేంద్రం ఓ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం మరువలేనిదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేసి, పేదలకు అన్నం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గొడ్డలి పార్టీ ఉందని.. పేదల సమస్యలు పట్టవని ధ్వజమెత్తారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టడానికి జగన్ అండ్ కోకు మనసొప్పదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టలేని పార్టీలు ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటేనని ఆగ్రహించారు. అందరినీ నరుకుతామని చెప్పి, నరబలి ఇస్తామని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడ ఉన్నది 1995 సీబీఎన్.. ఆ గొడ్డలి పార్టీ ఆగడాలను సాగనివ్వనని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డలను చట్టసభల్లో చూడాలనేదే తన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు మనుగడ సాగించలేకుండా చేయాలని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎన్నికల ముందు చెప్పానని తెలిపారు. 'మన ఇల్లు - మన వీధి - మన ఊరు' అనే ఆలోచన ప్రజలకు రావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కోసం 15 నెలలుగా కష్టపడుతున్నానని పేర్కొన్నారు. ఈ శనివారం 'జలధార జలహారతి' అనే థీమ్‌తో ముందుకు వచ్చానని.. వంద రోజులు కార్యాచరణతో పనిచేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలో నూటికి నూరు శాతం చెత్తను సేకరించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. చెత్తే మన సమస్య.. మన ఆరోగ్యానికి సమస్య అని చెప్పారు. 13 నగరాల్లో స్వీపింగ్ యంత్రాలు తెస్తున్నామని.. టెండర్లు పిలిచామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ప్రతీనెల పేదల సేవలో 60 లక్షల మందికి, ఏడాదికి రూ.33వేల కోట్లతో పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. అక్వాకల్చర్‌ను పరిశ్రమగా తీసుకెళ్లాలని సూచించారు. అక్వా కల్చర్‌తో కొంత కాలుష్య సమస్యలు వస్తున్నాయని ప్రస్తావించారు. ఆ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుని, అక్వాను అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనలో తక్కువ అభివృద్ధి చూపించిన శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలకు వస్తానని తెలిపారు. బాగా పనిచేస్తే అభినందిస్తానని.. లేకపోతే పని నేర్పిస్తానని.. అప్పటికీ బాగాలేకపోతే.. ఇక బాగుండదని హెచ్చరించారు. అధికారులు, తాను ప్రజలకు సేవకులం మాత్రమేనని.. పెత్తందార్లం కామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలకు వ్యసనాలు ఉన్నాయని.. ఆ వ్యసనాలు పోవాలని సీఎం చంద్రబాబు మందలించారు.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

**బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి**

**ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి**

**కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన**

**కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు**

**13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు**



న్యూఢిల్లీ,ఏప్రిల్18 (శ్రీచక్ర) 0 మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

**ఇప్పటికే 30 ఏళ్లుగా మోసం చేస్తోంది**

**మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం**

**నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన**

**ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం**



నిడదవోలు,ఏప్రిల్18(శ్రీచక్ర) : మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే 30 ఏళ్లు కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవుతాయో ఆ దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ల అమలు 2034కి వెళ్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకించినందుకు నిరసనగా శనివారం నిడదవోలులో ఎన్డీఏ కూటమి పక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నిమ్మల రామ్మోహన్ నాయుడు, క ందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని అన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయీ హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనకు బాధ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, సమాన ఆస్తి హక్కును దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కల్పించారని ఉద్ఘాటించారు.

# పునర్వికకు పునర్జన్మ

**నూరేళ్లు జీవించు చిట్టితల్లీ**

**ఖరీదైన ఇంజక్షన్‌కు లోకేశ్ సాయం**

అమరావతి,ఏప్రిల్18(శ్రీచక్ర) : అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమైన విషయం తెలిసిందే. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చగా.. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు స్పందించిన మంత్రి నారా లోకేశ్ . మిగతా రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో హామీ ఇచ్చారు. ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్ స్మా ఇంజెక్షన్‌ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు. ఈ నేపథ్యంలో 'నా హామీ నెరవేరింది. పునర్వికకు ఈ రోజు ఇంజెక్షన్ చేశారు. నూరేళ్లు జీవించు చిట్టి తల్లీ' అని పేర్కొంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. తమకు అండగా నిలిచి, తమ పాప ప్రాణాల్ని కాపాడేందుకు సాయం చేసిన మంత్రి లోకేశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో పునర్వికను బతికించాలని డొనేషన్స్ పేరుతో మహా యజ్ఞమే జరిగింది. ఎట్టకేలకు ప్రభుత్వం సైతం దిగి వచ్చింది. సోషల్ మీడియాలో వచ్చిన డోనేషన్‌తో పాటు ప్రభుత్వం సహాయం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ముందుకు వచ్చారు. ఇంజక్షన్ అమెరికా నుంచి హైదరాబాద్ తెప్పించడానికి సాయం చేశారు.

# పాత మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలి..

**ప్రధానికి ఇండియా కూటమి లేఖ**

న్యూఢిల్లీ: (శ్రీచక్ర) చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఆమోదించిన 2023 చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రికి లేఖ రాయనున్నట్టు తెలిపారు. ఇండియా కూటమి నేతలు శనివారంనాడిక్కడ సమావేశమయ్యారు. మహిళా రిజర్వేషన్



బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, అయితే బిల్లు ముసుగులో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని విపక్ష నేతలు ఆరోపించారు. ఇదే విషయాన్ని ప్రజల ముందుకు తీసుకు వెళ్లేందుకు దేశవ్యాప్తంగా మీడియా సమావేశాలు నిర్వహించనున్నట్టు 'ఇండియా' కూటమి నేతలు తెలిపారు.'ఇండియా' కూటమి ప్రత్యేక సమావేశం సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, విస్తృత ఏకాభిప్రాయంతో పార్లమెంటులో ఆమోదించిన పాత మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి సభలో ప్రవేశపెట్టాలని అన్నారు. '

# మహిళా బిల్లును అడ్డుకొని పండుగ చేసుకోవడం శోచనీయం కాదు: రిజిజు

ఢిల్లీ: (శ్రీచక్ర) మహిళా బిల్లును అడ్డుకున్న విపక్ష పార్టీలు మహిళలకు విరోధులుగా మిగులుతారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మహిళా బిల్లును అడ్డుకొని పండుగ చేసుకోవడం శోచనీయం కాదన్నారు. మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో కిరణ్ మీడియాతో మాట్లాడారు. మహిళలకు దక్కాల్సిన అధికారాన్ని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు రాకుండా చేశాయని మండిపడ్డారు. మహిళల హక్కులను కాపాడేందుకు కృషిచేస్తూనే ఉంటామని, మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తాము అన్ని విధాలుగా ప్రయత్నిం చామన్నారు.



మహిళలకు రక్షణ కల్పించే బిల్లును ఆమోదించకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య కిరణ్ రిజిజు పేర్కొన్నారు.లోక్‌సభ ప్రత్యేక సమావేశాలలో అత్యంత కీలకమైన మహిళా బిల్లుకు చుక్కెదురైన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీనితో చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోటా అమలు మరోసారి తీరని కల, కల్ల అయింది. 2029 నుంచి మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా, ప్రత్యేక సమావేశాల ద్వారా తీసుకువచ్చిన సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిం ది. బిల్లుపై ఓటింగ్ జరగగా అనుకూలంగా 298 మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా 230 మంది ఓటేసిన విషయం విధితమే.

శ్రీచక్ర
ఆదివారం 19-04-2026

# సంపాదకీయం

## అదను చూసి దెబ్బకొట్టిన విపక్షాలు

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు బిల్లు వీగిపోయింది. అయితే ఈ సూత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ మేధోమథనానికి దారితీసింది. బిల్లు చారిత్రాత్మకం.. దేశంలో ఉన్న మహిళలకు లభిస్తున్న గౌరవం.. ఇకపై వారు మరింత సాధికారత సాధించవచ్చు. చట్టసభల్లో మరింత సమున్నతంగా కొనసాగవచ్చు.. భారత మహిళలు మరింత అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నాం.. ఇదీ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లోకి వచ్చే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ మహిళలను ఉద్దేశించి రాసిన లేఖ.ఈ బిల్లు చర్చకు వచ్చే ముందు పార్లమెంట్లో విస్తృత సమావేశం జరిగింది. అధికార పక్షం నుంచి మొదలు పెడితే ప్రతిపక్షం వరకు నాయకులు తమ తమ వాణి వినిపించారు.. దీంతో చట్టసభల్లో మహిళ బిల్లు నెగ్గుతుందని.. మహిళలకు రిజర్వేషన్ వర్తిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ చారిత్రాత్మకమైన బిల్లు వీగిపోయింది. విపక్షాల ఐక్యత ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం తలవంచింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. విపక్షాల ఐక్యత ముందు తలవంచక తప్పలేదు.ఈ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. ఆ మెజారిటీని కూడగట్టడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైంది. దశాబ్దాలపాటు నెరవేరని కలగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు సహకారం కాలేదు.. శుక్రవారం పార్లమెంట్లో ఉత్కంఠ భరితమైన వాతావరణం మధ్య.. ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. సభకు మొత్తం 528 మంది హాజరయ్యారు. అనుకూలంగా 298 మంది మాత్రమే ఓటు వేశారు. మిగతా 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి నోచుకోవాలంటే కనీసం 352 మంది సభ్యులు ఆమోదం తెలపాలి. మ్యాజిక్ ఫిగర్ పొందడానికి 54 ఓట్లు అవసరం. అయితే వారంతా వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో బిల్లును తిరస్కరించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను మరునటి రోజుకు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.మొదటినుంచి కూడా డీలిమిటేషన్ చేపట్టాలని నిబంధన పై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ అమలుకు ముందు దీనిని చేపట్టాలనే ప్రభుత్వ నిబంధన పై మండిపడుతున్నాయి.. "ఇప్పుడు మీరెందుకు రిజర్వేషన్ అమలు చేయడం లేదు? భవిష్యత్ కాలంలో నిర్వహించే డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది మహిళలకు గర్వభంగాన్ని కలిగించే అంశమని" విపక్షాలు కేంద్రంపై మండిపడుతున్నాయి. అంతేకాదు కీలకమైన ఓటింగ్ సమయంలో విపక్షాలు మొత్తం ఏకతాటిపైకి వచ్చాయి. అంతేకాదు, మిత్రపక్షాలను కూడా కేంద్రం ఒప్పించలేకపోవడం నరేంద్ర మోడీ వైఫల్యానికి నిదర్శనం అని విశ్లేషకులు అంటున్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత.. కేంద్రం వెంటనే అప్రమత్తమైంది. మహిళా రిజర్వేషన్లతో సంబంధం ఉన్న డీ లిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాల సవరణ బిల్లులు మొత్తం వెనక్కి తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి ప్రకటించడం విశేషం. వాస్తవానికి బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం ఒకరకంగా బలహీనతను నిరూపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.విపక్షాలు ఎన్నడూ లేనంతగా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. దీనిని పసిగట్టడంలో అధికార పక్షం విఫలమైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు అమలవుతాయా.. ఇంకా కొంతకాలం ఇలానే ఉంటుందా.. అనే సందిగ్ధం కొనసాగుతూనే ఉంది.కాకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోకపోవడంతో.. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మహిళల ప్రభావం ఎన్నికల మీద పడుతుందని తెలుస్తోంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటితోనే కేంద్రం నిలిపి వేస్తుందా.. ఎన్నికలకు ముందు కొత్త సొంతం ముందుకు వస్తుందా.. విపక్షాల ఒత్తిడికి తలవంచుతుందా.. డీలిమిటేషన్ నిబంధన తొలగించి.. తాజాగా కొత్త బిల్లు ప్రవేశపెడుతుందా.. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.జనాభా ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం దారుణంగా పడిపోతుందన్న ఆందోళనలతో కేంద్రం ప్రతిపాదించిన ఈ ప్రోరాటా పద్ధతి ఏ మేరకు సమన్యాయం చేకూరుస్తుందనే దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. అమిత్ షా ప్రతిపాదించిన ఫార్ములాలోని ప్రధానాంశం ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను కచ్చితంగా 50 శాతం మేర పెంచడం. దీనివల్ల రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తి ఏమాత్రం మారదు. ఉదాహరణకు, లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లు 50 శాతం పెరిగినప్పుడు, మొత్తం సీట్ల సంఖ్య పెరిగినా దక్షిణాది రాష్ట్రాల వాటా అదే 24 శాతంగా కొనసాగుతుంది. తద్వారా జనాభా నియంత్రణ పాటించినందుకు ఏ రాష్ట్రమూ తన రాజకీయ బలాన్ని కోల్పోదని కేంద్రం భరోసా ఇస్తోంది.ఈ ప్రోరాటా పద్ధతి ఒక మధ్యేమార్గం . కేవలం 2021/2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది ప్రాబల్యం 18–20 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఈ 50 శాతం పెంపుదల సూత్రం వల్ల ఉత్తరప్రదేశ్ లేదా బీహార్ వంటి రాష్ట్రాలకు అదనపు ప్రయోజనం కలగదు, అలాగే కేరళ లేదా తమిళనాడు వంటి రాష్ట్రాలకు నష్టం వాటిల్లదు. అంటే, పార్లమెంటులో ఒక బిల్లును ఆమోదించుకోవడానికి అవసరమైన ఓట్ల శాతంలో దక్షిణాది రాష్ట్రాల బలం యధాతథంగా ఉంటుంది.అయితే, ఇక్కడ ఒక చిన్న మెలిక ఉందని కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు. శాతం పరంగా వాటా మారకపోయినా, సంఖ్యాపరంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కువగా ఉంటాయి. .

# నంద్యాలలో జలధార-జలహారతి కార్యక్రమం వేగవంతం

**కాలువల శుభ్రతకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి**
**సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి**
**కాలువల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు**
**చెత్త వేస్తే భారీ జరిమానాలు – కఠిన చర్యలు**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





నంద్యాల, ఏప్రిల్ 18 (శ్రీచక్ర): నంద్యాల పట్టణంలో నీటి వనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ "జలధార–జలహారతి" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని పొన్నాపురం కాలనీలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా కేసీ కాల్వలో పూడికతీత, పరిశుభ్రత కార్యక్రమాలలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని అనేక కాలువలు పూడికతో నిండిపోవడంతో నీటి ప్రవాహం ఆడంకానికి గురవుతోందని తెలిపారు. కాలువల్లో మొక్కలు, పొదలు అధికంగా పెరగడం వల్ల మురుగు నీటి నిల్వలు ఏర్పడి పారిశుధ్య సమస్యలు తీవ్రతరమవుతున్నాయని పేర్కొన్నారు. కాలువల శుభ్రతపై మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి తక్షణమే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి పట్టణంలోని ప్రధాన కాలువలన్నింటినీ దశలవారీగా శుభ్రపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు.భవిష్యత్తులో కాలువల్లో చెత్త వేయకుండా నిరోధించేందుకు ప్రతి ముఖ్య కాలువ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నీటి వనరులను కలుషితం చేసే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు. ఈ శుభ్రత కార్యక్రమాల్లో వార్డు ప్రజాప్రతినిధులు, స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న ఇరిగేషన్ అధికారులు పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యాలయంలో అక్రమ ప్రవేశాలపై వెంటనే విచారణ చేపట్టాలని,-విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్,

**నవోదయ పాఠశాల ఎదుట రాస్తారోకో నిర్వహించిన విద్యార్థి సంఘాలు,**
**ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బోగస్ విద్యార్థుల అటెండెన్స్,**
**అన్నీ తెలిసిన అక్రమ కోచింగ్ సెంటర్ కు విద్యాశాఖ అధికారుల అండదండలు,**
**గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల నుండి పెద్ద ఎత్తున ఫేక్ టి.సి. లు,**
**తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్,**






ఎమ్మిగనూరు, ఏప్రిల్ ,18( శ్రీ చక్ర): బనవాసి నవోదయ విద్యాలయంలో అక్రమ ఫేక్ టి.సి. ల ప్రవేశాలపై జిల్లా కలెక్టర్ స్పందించి , ఫేక్ టి.సి.ల ను ప్రోత్సహిస్తూన్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయినా ఖాజా భాష ని విధుల నుండి తక్షణమే సస్పెండ్ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య యు.ఎస్.ఎఫ్. ఐ,విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్ నాయుడు ,ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బనవాసి నవోదయ విద్యాలయ సమితి పాఠశాల ముందు రోడ్డుపై ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద బడుగు, బలహీన, గ్రామీణ వర్గాల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా నాణ్యమైన విద్య ,హాస్టల్ వసతి కల్పించి బడుగు బలహీన విద్యార్థులకు విద్యను అందించవలసిన నవోదయ విద్యాలయ సమితిలో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఆరోపించారు. కర్నూలు జిల్లాలోని నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో గ్రామీణ ప్రాంతంలో చదివిన విద్యార్థులకే ప్రథమ స్థానం అవకాశం ఉంటుందని గ్రహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దీన్ని ఆసరాగా తీసుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయినా కాజా భాష ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా , తన ఉపాధ్యాయ వృత్తిని కాదని, విక్టరీ కోచింగ్ సెంటర్ ను గత 20 సంవత్సరాల నుండి నిర్వహిస్తూ కోచింగ్ సెంటర్ పేరుతో పేద, బడుగు, బలహీన ,వర్గాల గ్రామీణ విద్యార్థులకు అందాల్సిన సీట్లను పక్కదారి పట్టిస్తూ తన కోచింగ్ సెంటర్ పేరిట ప్రతి సంవత్సరం దాదాపు 40 నుండి 50 సీట్లకు పైగా సీట్లు వచ్చేలా గా ప్రవేశ పరీక్షకు ఇన్విజిలేటర్లు గా పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులై న ఇన్విజిలేటర్స్ కు పెద్ద ఎత్తున డబ్బు ఆశ చూపి తమ కోచింగ్ సెంటర్లో చదివిన విద్యార్థులకు సహాయ సహకారాలకు అందిస్తే పెద్ద ఎత్తున డబ్బులు అందజేసి తమ కోచింగ్ సెంటర్ల కే సీట్లు వచ్చే విధంగా చేసుకుంటున్నాడని , ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఉంటూ ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులను విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ లో విద్యార్థులకు నవోదయ కోచింగ్ ను అందిస్తూ ,ఒకే విద్యార్థి ఒకటికి రెండుసార్లు నవోదయ ప్రవేశ పరీక్ష రాసే విధంగా వేరు వేరు బ్లాక్ ల నుండి నవోదయ ప్రవేశాలకు అప్లై చేయిస్తూ, తన ప్రోద్బలంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కొన్ని గ్రామీణ ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఫేక్ టి. సి. ల ను తెప్పిస్తూ, అక్రమ నవోదయ ప్రవేశాల ద్వారా విద్య ను వ్యాపారం చేస్తూ నిజమైన పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అందాల్సిన సీట్లకు తూట్లు పొడుస్తున్నాడని , ఇటువంటి ఫేకు టి.సి.లకు నవోదయ ప్రిన్సిపాల్ కూడా వత్తాసు పలుకుతూ విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ లో ఉండే విద్యార్థులకు ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు తీసుకుంటూ వత్తాసు పలుకుతున్నారని కావున ఇటువంటి ప్రిన్సిపాల్ ను మరియు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఉండి ఇటువంటి అక్రమ ప్రవేశాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయిన కాజా భాష ని కూడా సస్పెండ్ చేసి నవోదయ విద్యాలయ సమితిలో జరుగుతున్నటువంటి అక్రమ ప్రవేశాల ఫేక్ టి. సి.ల పై కర్నూలు జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అందాల్సిన స?ళి8:46 జూఎ, 18/4/2026ఠ +91 97038 60909: సీట్లను వారికి అందేలా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు నాయకులు సందీప్, మధు,

## కర్నూలు లో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ఉ ధర్నా

కర్నూలు, ఏప్రిల్ 18 (శ్రీచక్ర): దేశంలో పెరుగుతున్న వికృత జిహాదీ మానసిక ప్రవృత్తి, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, బలవంతపు మత మార్పిడులు మరియు సమాజ వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా శనివారం కర్నూలు నగరంలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ మరియు ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం గేటు నుండి గాంధీ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో హిందూ సమాజం, యువత, కార్యకర్తలు పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు, అక్రమ భూ ఆక్రమణల తొలగింపు, లవ్ జిహాద్ ఉ బలవంతపు మత మార్పిడులపై కఠిన చట్టం, గిరిజన ప్రాంతాల్లో హిందూ కుటుంబాల రక్షణఈ సందర్భంగా భారత రాష్ట్రప కి వినతిపత్రం సమర్పిస్తూ, దేశంలో శాంతి, భద్రత, సామరస్య కాపాడాలని బజరంగ్ దళ్ డిమాండ్ చేసింది.



## టీటీడీ తరహాలో భక్తులకు తాగు నీరు

మంత్రాలయం, ఏప్రిల్ 18,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వేసవి దృష్ట్యా శనివారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తుల దగ్గరికి మంచి నీటిని అందించే విధంగా శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగు నీరు నేరుగా భక్తుల చెంతకు రావటంతో హర్షం వ్యక్తం చేశారు.



## ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ విరాళం



కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (శ్రీచక్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు ఉండడం సంతోషంగా ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ అన్నారు. కర్నూలులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కు ఆయన మైక్ సెట్ విరాళంగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతాధికారులు కావాలని కోరారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బయట ఆహారం తీసుకోకుండా వసతి గృహంలో అందిస్తున్న వాటిని మాత్రమే తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కు తన వంతు సహాయ సహకారాలు భవిష్యత్తులో అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ అరుణ, సలోమి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యతో ఎక్కువ ఉపాధి అవకాశాలు
## మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్



కర్నూలు, ఏప్రిల్ 18 (శ్రీచక్ర): విద్యార్థులు రెగ్యులర్ విద్యతో కాకుండా, సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలను పొందవచ్చు అని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక సి క్యాంప్ సెంటర్ నందు ఉన్న టీజీవి కళాక్షేత్రంలో విద్యా అకాడమీ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రెగ్యులర్ విద్యా విధానంలో కాంపిటీషన్ ఎక్కువగా ఉంటుందన్నారు. సాంకేతిక విద్యా రంగంలో నైపుణ్యత మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని తెలిపారు. పదవ తరగతి తర్వాత ప్రతి ఒక్కరు ఇంటర్ తద్వారా ఇంజనీరింగ్ మెడిసిన్ వైపు ఆలోచిస్తారని అది అందరికీ సాధ్యమయ్యే పని కాదన్నారు. ఎవరికివారు తమ తమ సామర్థ్యాన్ని బట్టి పాలిటెక్నిక్, నర్సింగ్, ఐటిఐ వంటి సాంకేతిక రంగాలను ఎంచుకుంటే చదివిన తర్వాత నిరుద్యోగిగా ఉండవలసిన అవసరం ఉండదు అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు కూడా పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టీజీ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులందరూ ప్రస్తుతం ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, విద్య అకాడమీ డైరెక్టర్ లు కొనేటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రిటైర్డ్ ఆర్టీవో కోనేటి చంద్రబాబు, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కొట్టే చిన్నయ్య, రిటైర్డ్ ఏఎస్పి రామ్ నాథ్, రామకృష్ణ, ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 20న సర్వ శాంతి విశ్వ శాంతి -బసవ జయంతి వేడుకలు,



ఎమ్మిగనూరు, ఏప్రిల్, 18 (శ్రీ చక్ర):–ఎమ్మిగనూరులో ఏప్రిల్ 20 న సుప్రీమ్ కోర్ట్ అడ్వకేట్ కాకర్ల చంద్ర శేఖర్ ఇంటి ఆవరణలో నిర్వహించే 'సర్వ శాంతి–విశ్వ శాంతి' ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించడం వీరశైవ లింగాయతులు అందరికీ శుభాభినందనమని రాష్ట్ర వీరశైవ లింగాయతి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి హిందువులో బసవతత్వం గురించి అవగాహన పెంపొందించుకోవాలని దానితోపాటు అందరూ ధర్మం వైపు నడవాలని పేర్కొన్నారు. అదే విదంగా ఏప్రిల్ 20 న జరగబోయే బసవన్న ర్యాలీని ప్రతి హిందూ మరియు వీరశైవ లింగాయుతి బంధువులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

# చికిత్స పొందుతూ మరో ఇద్దరు మహిళలు మృతి-11మందికి చేరిన మృతుల సంఖ్య





మంత్రాలయం , ఏప్రిల్ 18,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 11 మందికి క చేరింది. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం కర్ణాటక రాష్ట్రం, హాసన్ జిల్లా, బేలూరు తాలుకా, శెట్టి గేర్ గ్రామానికి చెందిన ఆర్. శుభ ఏ సుబ్బమ్మ (32 ) ,కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా, కన్నేతన హల్లి గ్రామానికి చెందిన జయమ్మ (60 ) మహిళలు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులు అప్పగించారు.

# నీటి సమస్యను పరిష్కరించిన టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి



మంత్రాలయం , ఏప్రిల్ 18,(శ్రీచక్ర) :మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి నీటి సమస్య పరిష్కారినట్లు కాలనీ వాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా మా కాలనీకి పంచాయతీ నీరు సమస్య ఉండేదని , గత ప్రభుత్వం , అప్పటి అధికారులకు ఈ విషయమై పలసార్లు విన్నవించిన పరిష్కరించలేదన్నారు. ఎస్సీ కాలనీకు పంచాయతీ నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ విషయమై నేడు న్యాయవాది విజయ్ కుమార్, జనసేనా నాయకుడు యోసేపు మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తన సొంత నిధులతో ఎస్సీ కాలనీకు బోర్ వేయించి నీటి సమస్యలు పరిష్కరించినట్లు వారు తెలిపారు. ఎస్సీ కాలనీవాసులు నీటి సమస్య పరిష్కారమైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. సహకరించిన మంచాల సొసైటీ చేరిన రామకృష్ణారెడ్డి కి, రఘునాథ్ రెడ్డి కి, యువ నాయకులు రాకేష్ రెడ్డి కి, రాజా రెడ్డి గారికి కాలనీవాసుల కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం -టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి



మంత్రాలయం, ఏప్రిల్ 18,(శ్రీచక్ర) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని మంత్రాలయం టిడిపి ఇన్చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో మంత్రాలయం , కౌతాళం , కోసిగి , పెద్దకడుబూర్ నాలుగు మండలాలకు మంజూరైన రూ. 9.92లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావిస్తూ అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం ఆదర్శనీయమన్నారు. ఇలాంటి పథకాల వల్ల వేలాది కుటుంబాలకు సీఎం సహాయ నిధి భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే మనందరి బాధ్యత డిఎస్పీ భార్గవి వెల్లడి





ఎమ్మిగనూరు, ఏప్రిల్, 18 (శ్రీ చక్ర):-నియోజకవర్గ పరిధిలోని నందవరం గ్రామంలో మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలోని నందవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నందవరం పట్టణంలో మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ మరియు బాలికల విద్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి, రూరల్ ఎస్సై శ్రీనివాసులు, నందవరం ఎస్సై తిమ్మారెడ్డి మరియు శక్తి టీం సంయుక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ సమాజంలో మహిళలు సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళలపై వేధింపులు, హింస వంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాల్య వివాహాలు చట్టపరంగా నేరమని, బాలికల భవిష్యత్తును దెబ్బతీసే అంశమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని, చిన్న వయసులో వివాహం చేయకూడదని సూచించారు.వేసవికాలంలో దొంగతనాలు జరిగే అవకాశమున్నందున గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.అలాగే అసాంఘిక కార్యకలాపాలు అయిన మాట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఏదైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధి సమాజ పురోగతికి కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ : నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగం నివారించాలని అవగాహన కల్పించారు.డీఎస్పీ భార్గవి, ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి, రూరల్ ఎస్సై శ్రీనివాసులు, నందవరం ఎస్సై తిమ్మారెడ్డి , గ్రామ మహిళలు మరియు గ్రామస్థులతో కలిసి "బాలికల చదువును ప్రోత్సహించండి ? బాల్య వివాహాలను అడ్డుకోండి" అనే కార్యక్రమం పై రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు.

# శ్రీసిటీలో శ్రీవాణి ఉగాది పురస్కారాల వేడుక పలువురి ప్రముఖులకు పురస్కారాల ప్రదానం



శ్రీసిటీ, ఏప్రిల్ 18(శ్రీచక్ర)తెలుగు ఉగాదిని పురస్కరించుకుని యేటా శ్రీసిటీలో నిర్వహించే ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందచేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా ప్రముఖ పద్య నాటక కళాకారులు డాక్టర్ మీగడ రామలింగస్వామి, హరికథా భాగవతార్ డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రి, ఆధ్యాత్మికవేత్త కందాడై సెల్వన్, జానపద కవి గాయకులు పోల్లూరు జగన్నాథం పురస్కారాలను అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన కళారత్న డా. మీగడ రామలింగ స్వామి 47 ఏళ్లుగా తెలుగు పద్యనాటక రంగంలో కవి, నటుడు, దర్శకుడు, గాయకుడు, రచయితగా విశిష్ట సేవలు అందించారు. గుంటూరు వాసి, తిరుపతి ఎస్వీ సంగీత కళాశాల మాజీ ప్రధానాచార్యులు ముప్పవరపు సింహాచల శాస్త్రి హరికథలో నాలుగు దశాబ్దాల అనుభవం, రామాయణం మరియు కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యులు. ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, మంగళంపాడుకు చెందిన కందాడై సెల్వన్ 36 సంవత్సరాల ఉపాధ్యాయ సేవ అనంతరం దివ్యప్రబంధాన్ని తెలుగులోకి అనువదిస్తూ గ్రామీణ ప్రజలకు శ్లోకాలు, స్తోత్రాలు బోధిస్తున్నారు. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం నివాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రజాకవి, గాయకుడు అయిన పోలూరు జగన్నాథం జానపద గాయకులుగా సుపరిచితులు. ఎయిర్, ఈటీవీ మాధ్యమాల్లోను తన కార్యక్రమాలు ప్రసారమై గుర్తింపు పొందారు. పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, ప్రముఖులను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా ఎదుగుతున్న శ్రీసిటీ, మంచి నివాసయోగ్య ప్రాంతంగా రూపుదిద్దుకునే క్రమంలో కళలను ప్రోత్సహిస్తూ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రతినెలా నిర్వహించే శ్రీవాణి కార్యక్రమాల్లో శ్రీసిటీ పరిధిలోని ఉద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని కోరారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధితో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తూ శ్రీవాణి వేదిక ద్వారా ఆధ్యాత్మిక సాహిత్య కార్యక్రమాలను చేపట్టడం పట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని అభినందించారు. శ్రీసిటీలో పచ్చదనం, సమగ్ర ప్రణాళికతో కూడిన అభివృద్ధిని ప్రశంసించారు. తమ ప్రతిభను గుర్తించి ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబీకులు, పరిసర గ్రామాలతో పాటు సూళూరుపేట, శ్రీహరికోట, చెన్నై నుంచి పలువురు సాహిత్య ప్రియులు పాల్గొన్నారు. శ్రీసిటీ వీఆర్వో వల్లేటి బాలాజీ కార్యక్రమ ప్రయోక్తగా వ్యవహరించారు.

# ఆర్ అండ్ బి అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి.., సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కటారి.జయ జయ రావు..,




కోట : ఏప్రిల్ 18 (శ్రీ చక్ర): ఆర్ అండ్ బి అధికారులు బాధ్యతాయుతంగా విధులు చేపట్టాలని కోట మండల తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాల్ నందు స్థానిక ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు,ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,వాకాడు ఏఎంసీ చైర్మన్ మర్రి.ప్రమీల,ఇంచార్జి ఎంపీపీ వేమారెడ్డి సౌజన్య రెడ్డి,ఉప ఎంపీపీ ఉప్పల శేషయ్య గౌడ్ లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో తాహాసిల్దార్ కే.జయ జయ మాట్లాడుతూ మండలంలో ఆర్ అండ్ బి అధికారులు విధులు పట్ల నిర్లక్ష్యం వహించడం సబబు కాదని మండలంలో ఉండే నిరుపయోగంగా ఉండే ఆర్ అండ్ బి రోడ్లపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ అండ్ బి డి ఈ చంద్రశేఖర్ రెడ్డి కి తాహాసిల్దార్ తెలిపారు.అంతేగాకుండా మండల పరిధిలో జనాభా మరణాల నమోదు ప్రక్రియను పంచాయితీ సెక్రటరీలు సక్రమంగా నిర్వహించాలని లేని పక్షంలో సంబంధిత వారిపై పై స్థాయి అధికారులకు రిపోర్ట్ చేస్తానని తెలిపారు.ప్రస్తుతం ఎన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జనాభా లెక్కలపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని గుర్తు చేశారు. తూ మండలంలోని అన్ని పంచాయితీల్లో ప్రత్యేక అధికారులను కేటాయించడం జరిగిందని తెలుపుతూ ఆయా అధికారులు పంచాయతీల్లో ఉండే సమస్యలను గుర్తించి తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.అయితే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం విశేషం.ఈ కార్యక్రమంలో కోట తాహాసిల్దార్ కటారి జయ జయ రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ ఉప ఎంపీపీ ఉప్పల శేషయ్య గౌడ్ ఏఎంసి చైర్మన్ మర్రి ప్రమీల,పలు శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభ రద్దు? కార్యదర్శి గైర్హాజరుతో ప్రజల్లో నిరాశకార్యదర్శి తీరు పై గ్రామస్తుల్లో అసహనం.



వరదయ్యపాలెం,ఏప్రిల్ 18( శ్రీచక్ర):ఇందిరానగర్ గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారం కోసం 18-04-2026న నిర్వహించాల్సిన గ్రామసభ, పంచాయతీ కార్యదర్శి గైర్హాజరుతో రద్దు కావడం గ్రామ ప్రజల్లో తీవ్ర నిరాశను కలిగించింది. పద్మావతిపురం కమ్యూనిటీ హాల్ లో గ్రామసభ నిర్వహణకు ముందుగా దండోరా వేయించి ప్రజలందరినీ ఆహ్వానించడంతో, ఎప్పుడూ లేని విధంగా అధిక సంఖ్యలో గ్రామస్థులు హాజరయ్యారు.పంచాయతీ కార్యదర్శి పిలుపు మేరకు గ్రామ సమస్యలపై చర్చించేందుకు ప్రజలు ఉత్సాహంగా పాల్గొనగా, సభకు ఎంపీడీవో విజయమ్మ , అగ్రికల్చర్ ఆఫీసర్ గౌరీ, జూనియర్ అసిస్టెంట్ మాధవి, వెలుగు సిసి యశోద, వీఆర్ఓ మోహన్ , వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి డి ఏ తదితర ప్రభుత్వ అధికారులు సకాలంలో హాజరయ్యారు.అయితే, సభను సమన్వయం చేసి నిర్వహించాల్సిన పంచాయతీ కార్యదర్శి మాత్రం గైర్హాజరు కావడంతో పరిస్థితి మారింది. బాధ్యత గల అధికారి లేకపోవడంతో ప్రజలు , అధికారులు ఉన్నప్పటికీ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేక గ్రామసభను రద్దు చేయాల్సి వచ్చింది.ఈ పరిణామంతో ప్రభుత్వ యంత్రాంగం విలువైన సమయం వృథా కావడమే కాకుండా, తమ పనులన్నీ మానుకుని వచ్చిన సాధారణ ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గ్రామస్థులు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామసభల ప్రాముఖ్యతను కాపాడేందుకు ఇలాంటి నిర్లక్ష్యాలు పునరావృతం కాకుండా చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.తమ గ్రామ సమస్యలను పట్టించుకునే కార్యదర్శిని నియమించాలని ఎంపీడీఓ విజయమ్మను కోరారు.

# రూ.500 రాహు-కేతు పూజ టికెట్ పై పునరాలోచన అవసరం



వరదయ్యపాలెం,ఏప్రిల్ 18(శ్రీచక్ర): శ్రీకాళహస్తి వాయులింగేశ్వర దేవస్థానంలో జరుగుతున్న రాహు-కేతు పూజల్లో రూ.500 టికెట్‌ను రద్దు చేయడం పట్ల పునరాలోచించాలని ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్ గుత్తి త్యాగరాజు ఆలయ కమిటీ కి విజ్ఞప్తి చేశారు.సామాన్య భక్తులకు కూడా శివయ్య సేవలు సులభంగా అందుబాటులో ఉండాలని భక్తి మార్గం అందరికీ సమానంగా ఉండేలా చర్యలు అవసరం అన్నారు. రూ.500 టికెట్‌ను యథావిధిగా కొనసాగించాలని,సామాన్య భక్తులకు ఇబ్బంది లు కలగకుండా చూడాలని,దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్ గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి చేశారు.కమిటీ తీసుకునే నిర్ణయాలు సామాన్యులు సైతం హర్షించే విధంగా వుండాలని అయన అభిప్రాయ పడ్డారు.

# శ్రీ ప్రగతి విద్యానికేతన్ లో ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు..., క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శ్రీ ప్రగతి విద్యా నీకేతన్ చైర్మన్ పసుపులేటి కిషోర్...,

కోట :ఏప్రిల్ 18 (శ్రీ చక్ర): కోట మండలంలోని శ్రీ ప్రగతి విద్యా నీకేతన్ స్కూల్ లో జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించి అనంతరం విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ చేతులుమీదుగా క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని తెలియజేశారు.క్రీడల వలన శారీరక దృఢత్వం అభివృద్ధి చెందుతుందని తద్వారా శారీరకంగా,మానసికంగా,దృఢంగా అభివృద్ధి చెంది చదువులో కూడా రాణించగలరని అన్నారు.అంతే కాకుండా గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే కష్టాలను సైతం ధైర్యంగా ఎదుర్కొంటారని తెలియజేశారు.అదేవిధంగా నేటి రోజుల్లో చాలా పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు లేవని కానీ శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణం కలిగి అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రోజు క్రీడలలో శిక్షణ ఇచ్చి వార్షిక క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.ఈ పోటీల్లో భాగంగా విద్యార్థిని,విద్యార్థులకు పరుగు పందేలు,లాంగ్ జంప్, కబడ్డీ,ఖో ఖో,హ్యాండ్ బాల్,వాలీ బాల్,షాట్ పుట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాలలో పనిచేసే ఉపాధ్యాయులు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.






శ్రీచక్ర

ఆదివారం 19-04-2026

## జవహర్ నగర్ మునిసిపల్ హైస్కూల్ "బడి పిలుస్తోంది ర్యాలీ



మార్కాపురం ఏప్రిల్ 18( శ్రీ చక్ర)మార్కాపురం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు 'బడి పిలుస్తోంది' ర్యాలీ ని మార్కాపురం మండల విద్యాశాఖ అధికారి బి రాందాస్ నాయక్ ప్రారంభిం చారు.. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం 30వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య, జవహర్ నగర్ లోని మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రమేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు టి సత్య నారాయణ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులతో.ర్యాలీ.నిర్వహిం చారు. ఈ సందర్భం గా ఎం ఈ వో మాట్లాడుతూ తమ పరిధిలో బడి ఈడు కలిగిన పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు ఇందుకు సంబంధించి విద్యా శాఖ వారం రోజుల ప్రణాళికను రూపొందించిందని ప్రధానంగా ఒకటో తరగతిలో ప్రవేశాలపై దృష్టిసారించాలని అన్నారు . అలాగే ప్రభుత్వ బడుల్లో ఐదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఆరో తరగతి ప్రభుత్వ యూపీ/ఉన్నత పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత.హెచ్ఎం,ఉపాధ్యాయులదే నన్నారు.30వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లి పాఠశాలలపై నమ్మకం పెంచేలా పిల్లల నమోదు మరింత పెంచేలా కృషి చేయాలని సూచించారు కార్యక్రమంలో .ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు

## మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవడం హేయమైన చర్య.బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్. ఏలూరి రామచంద్రారెడ్డి.



మార్కాపురం ఏప్రిల్ 18 (శ్రీ చక్ర)మార్కాపురం.లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయానికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు.. ఈ బిల్లు అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ, మరియు మరికొన్ని పార్టీలు హీనబుద్ధిని ప్రదర్శించాయని విమర్శించారు.. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం మహిళల పట్ల ఆ పార్టీలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని విమర్శించారు. మహిళలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఈ విధంగా వ్యవహరించిందని ఆయన అన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్, ఇండి కూటమి తమ స్వార్థ రాజకీయాల కోసం గత 30 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ దేశంలోని నారీ శక్తికి తీరని అన్యాయం చేశాయన్నారు.చట్టసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడమే కాకుండా, వారి సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపేలా ఈ కూటమి నేతలు సాంకేతిక సాకులు చెబుతూ పదేపదే ఈ చారిత్రక సంస్కరణను బలిపీఠంపైకి నెట్టారని ఏలూరి ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన క్రెడిట్‌ను మీరే తీసుకుండని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేసినా కూడా కాంగ్రెస్ పార్టీ సహకరించకపోవడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. మహిళల హక్కులు, అవకాశాల పెంపుకు సంబంధించిన అంశాలలో రాజకీయాలను పక్కన పెట్టి సమగ్రంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరించిందని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గ్యాస్ స్గొడౌన్.లు .పెట్రోల్ బంకుల లో అవగాహన

మార్కాపురం ఏప్రిల్ 18 (శ్రీ చక్ర) మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డు నందు గల బీపీసీఎల్ గ్యాస్ గోడౌన్, సీతా నాగులవరం గ్రామం వద్దగల బీపీసీఎల్ పెట్రోల్ బంక్, ఎస్టేట్ నందు గల మదర్ రైస్ మిల్లు మరియు ఎస్టేట్లో గల బిపిసిఎల్ ఫిల్లింగ్ స్టేషన్ నందు అగ్నిమాపక అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన సదస్సు నందు అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను గురించి వారికి వివరించి, ఆ పరిసరముల నందు జరుగు అగ్ని ప్రమాదాల గురించి వారికి అవగాహన కల్పించి వారికి తగు సూచనలు జాగ్రత్తలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా మార్కాపురం నందు గల పెట్రోల్ బంకులు, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, పలకల పరిశ్రమలు నందు కూడా అవగాహన సదస్సును ఏర్పాటు చేసి అక్కడ గల ప్రజలకి పాంప్లెట్స్ పంపిణీ చేసి, ఆ పరిసరములు నందు అగ్ని ప్రమాద జాగ్రత్తలు గల పోస్టర్లను అతికించడం జరిగింది. అగ్నిమాపక శాఖ యొక్క హెల్ప్ లైన్ నెంబర్లు గల పోస్టర్లను కూడా అందరికీ కనబడే విధంగా అక్కడ అతికించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు మార్కాపురం అగ్నిమాపక అధికారి రేగలగడ్డ రామకృష్ణ మరియు ఇతర అగ్నిమాపక సిబ్బంది పాల్గొనడం జరిగింది




## పచ్చిరొట్ట విత్తనాలు చల్లడంతో భూసారం పెరుగుతుంది.పచ్చిరొట్ట ఎరువులు సాగును ప్రోత్సహించండి. జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్.



రామచంద్రపురం, ఏప్రిల్ 18( శ్రీచక్ర)భూమిని అధిక సూర్య రష్మి (ఎండల) నుండి రక్షించేందుకు రైతులు పచ్చిరొట్ట సాగును ప్రోత్సహించాలని కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం కాజలూరు మండలం జగన్నాథగిరి,కాజలూరు గ్రామాల్లో విజయ్ కుమార్ పర్యటించారు.?ఈ పర్యటనలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఈ సంవత్సరం "ఎల్ నినో" ప్రభావం వలన వర్షపాతం తక్కువగా పడే అవకాశం ఉన్నందున రైతాంగం సమాయత్తం కావాలని సూచించారు. భూమిని ఎండ నుండి రక్షించే విధంగా 'పచ్చిరొట్ట ఎరువులైన పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చి రొట్ట విత్తనాలను చల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని, ఉష్ణోగ్రత తగ్గి తేమ శాతం పెరుగుతుందని వివరించారు. దీనివల్ల రైతులకు ఎరువుల ఖర్చు తగ్గి అదనపు ఆదాయం కలుగుతుందని తెలిపారు. పీ.ఎం.డీ.ఎస్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయ సంస్థ ద్వారా అందిస్తున్న 32 రకాల విత్తనాల కిట్లను రైతులు వినియోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని కోరారు.అలాగే, దాల్వా పంట కోతలు మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో, రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాల ప్రకారం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరప సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాబురావు, మండల వ్యవసాయ అధికారి వి. అశోక్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్ వర్మ, ప్రశాంత్, వ్యవసాయ సహాయకులు తులసిరామ్, సత్య, సాహిత్య, సౌమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత - జలసంరక్షణపై డిపో మేనేజర్ భాస్కరరావు ప్రతిజ్ఞ.వివిధ రకాల మొక్కలు నాటిన సిబ్బంది ఈకార్యక్రమం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంది



రామచంద్రపురం, ఏప్రిల్ 18 (శ్రీచక్ర)స్వర్ణాంధ్ర ? స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పేపకాయల భాస్కరరావు ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర ? స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగంగా, పరిశుభ్రతతో పాటు జలవనరుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ఉండాలని భాస్కరరావు సిబ్బందిని ఉద్దేశించి ప్రతి నీటి చుక్క ముందు తరానికి ఉపయోగం గా ఉండాలని తెలియజేశారు. ఈసందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేసి వివిధ రకాల మొక్కలు నాటించారు . ఈ సందర్భంగా స్వచ్ఛంద ప్రతిజ్ఞ చేయించి ప్రతి నీటి బొట్టును ఆదాసేస్తూ జలవనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది గ్యారేజ్ సిబ్బంది , కార్మికులు తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు . ఇలాంటి కార్యక్రమం సమాజానికి ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుందని భాస్కరరావు తెలిపారు.

# కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ

శ్రీకాకుళం, ఏప్రిల్ 18, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ ప్రక్రియ మొదలైంది. నిపుణుల నియామ కాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. ఉద్దాన ప్రాంత వాసుల నుంచి వ్యాధుల రాకకు కారణాలపై రక్త నమూనాలను సేకరిస్తున్నారు.కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యల గురించి పరిశోధన బృందం సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు.ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నందున వాటి మూలాలు కనుగొనే ందుకు గతేడాది నవంబరులో ఇండియన్ కౌన్సెల్ అఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్-డిపార్టుమెంట్ అఫ్ హెల్త్ రీసెర్చ్ విభాగం) మూడేళ్ల కాలపరిమితితో ప్రత్యేకంగా రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ మేరకు ఐసిఎంఆర్ సానుకూలంగా స్పందించింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ తాతపూడి రవిరాజు మెంటార్‌గా అంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా పరిశోధన ప్రారంభమైంది.శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా ఏర్పడిన బృందం ఉద్దాన ప్రాంత స్థానికులను కలుసుకుంటోంది. ఇప్పటివరకు సుమారు 1,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. వీటిని పలాసలోని కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో తొలుత భద్రపరిచి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో కేజీహెచ్ లో ఉన్న ల్యాబ్ కు తరలిస్తున్నారు .ఐసీఎంఆర్ ఆమోదం తెలిపిన మేరకు విశాఖ కేజీహెచ్ లో సెంట్రిఫ్యూజ్ లు, డీప్ ఫ్రీజర్లు, శాంపిల్ స్టోరేజీ సిస్టమ్స్, అనలిటకల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫీల్డ్ శాంపిలింగ్ కిట్లు ఈ ల్యాబ్ లు ఉన్నాయి. సుమారు రూ.80 లక్షలతో కొనుగోలుచేసిన అత్యాధునిక పరికరాలు/యంత్రాలను బయో సేఫ్టీ ప్రమాణాలకు ల్యాబ్ లో ఏర్పాటయ్యాయి.బయో మార్కర్స్ టెస్టింగ్ ద్వారా కిడ్నీ బాధితులను ప్రాథమిక దశలోనే అతి త్వరగా గుర్తించేందుకు వీలుందని మెంటార్ డాక్టర్ రవిరాజ్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి. ప్రసాద్ వెల్లడించారు. మూత్ర నమూనాలను 'బయో మార్కర్ విధానంలో పరీక్షించడంవల్ల రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడేందుకు అవకాశం ఉన్నట్లయితే సూక్ష్మ స్థాయిలో తెలిసిపోతుందని వివరించారు.కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మూకుమ్మడిగా ఇటువంటి పరీక్షలు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. మూత్ర నమూనాల సేకరణలో బాధితుల కుటుంబ నేపథ్యం, ఇతర వైద్యులు వెల్లడించా రు.ఈ ఫలితాల ఆధార ంగా రోగు లు తగిన జాగ్రత్తలతో వ్యవహరిం చేందుకు, ముదరకుండా... కిడ్నీలు చెడిపోకుండా ఉండేందుకు వీలుంది. ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు.

## రాష్ట్ర బిజెపి మైనార్టీ పదవికి పార్టీ సభ్యత్వానికి రాజీనామాడాక్టర్ షేక్ షబానా వెల్లడి




మార్కాపురం ఏప్రిల్ 18 ( శ్రీ చక్ర)మార్కాపురం పట్టణానికి చెందిన షేక్.షబానా.గత.పది.సంవత్సరాలుగా మైనార్టీ విభాగం బిజెపి పార్టీలో వివిధ పదవులలో కొనసాగుతూ వివిధ సేవా కార్యక్రమాలు పార్టీ భాలోపేత కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా లోకసభలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ముస్లిం మైనార్టీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ ఏమి ఉండదనీ ప్రకటించడంతో విస్మయానికి గురైనట్లు ఆమె అన్నారు. ఈ సందర్భంగా తన బిజెపి పార్టీకి, తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు స్థానిక ప్రెస్ క్లబ్ నందు పాత్రికేయుల సమావేశంలో ఆమె ప్రకటించారు. ఇప్పటివరకు పది సంవత్సరాల కాలంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బిజెపి పెద్దలు అందించిన సహకారానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## అనవసరపు వాయిదాలు కోరవద్దు తొందరగా న్యాయం చేకూర్చేలా చేయండి.లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు.



రామచంద్రపురం, ఏప్రిల్ 18( శ్రీచక్ర)ప్యానల్ న్యాయవాదులు కోర్టు ద్వారా కేటాయించబడిన కేసులకు సంబంధించి అనవసర వాయిదాలు కోరవద్దని లోక్ అదాలత్ ద్వారా సహాయం కోరి వచ్చిన పేద వర్గాల వారికి వీలైనంత తొందరగా న్యాయం చేకూర్చేలా ప్రయత్నించాలని రామచంద్రపురం లోక్ అదాలత్ ఛైర్మన్ ,సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్వరరావు అన్నారు . ఈమేరకు శనివారం సబ్ కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ ప్యానల్ లాయర్లు,పిఎల్వీలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పి ఎల్ వీ లు కూడా ఆయా గ్రామాల్లో జరిగిన సంఘటనలు బాధితుల తరఫున సహాయం సహకారాలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పలివెల సత్యనారాయణ, సన్నపు బాలసుబ్రమణ్య కుమారస్వామి, కె.వి సత్యవాణి,దొమ్మలపాటి సత్యనారాయణ,బొడ్డు వరాహ నరసింహమూర్తి, జుత్తుక నాగేశ్వరరావు, కటకం అబ్బురం,మండ సత్తిరెడ్డి, చింతపల్లి శ్రీనివాసు, నందిక కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత. స్వర్ణాంధ్ర ? స్వచ్ఛాంధ్రలో మంత్రి తండ్రి సత్యం




రామచంద్రపురం, ఏప్రిల్ 18( శ్రీచక్ర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర ? స్వచ్ఛాంధ్ర సంకల్పంలో భాగంగా, పరిశుభ్రతతో పాటు జలవనరుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి సుభాష్ తండ్రి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తెలిపారు. శనివారం స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ నీటి సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలధార ? జలహారతి థీమ్‌తో నీటి సంరక్షణపై దృష్టి సారిస్తూ వర్షపు నీటిని నిల్వ చేసి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. నీటి కాలుష్యం కారణంగా క్యాన్సర్, కిడ్నీ, లివర్ వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొంటూ వాటి నివారణకు చర్యలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు మాట్లాడుతూ జల సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, అధికారులు, హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కిలారు రాజేష్ కు ఎందుకంత ప్రాధాన్యం

విజయవాడ, ఏప్రిల్ 18,రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది.2012లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014లో ఏపీలో తెలుగుదేశం ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువ గళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు.

# కిడ్నీ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీరు తాగుతున్నారా?



కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరికీ తెలిసిందే. ఇది సహజంగా ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలతో బాధపడుతున్న వారు కొబ్బరి నీరు తాగడం మంచిదా అనే ప్రశ్న చలా మందిలో ఉంది. అయితే ఇది వారి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కొబ్బరి నీరులో పోషక విలువలు కొబ్బరి నీరు సహజంగా పొటాషియం, సోడియం, మెగ్నీషియం, కాల్షియం, ఇతర ఖనిజ లవణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీరులో తక్కువ శాతం చక్కెర , కొవ్వు ఉంటాయి, అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది. మూత్రపిండాల సమస్యలు కొబ్బరి నీరు శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది, ఇది మూత్రపిండాల్లో కణికలు ఏర్పడకుండా ఉండటానికి ఉపయోగపడుతుంది. ఇందులో నెచురల్ సిట్రేట్ ) ఉండడం వల్ల, రాళ్ళు ఏర్పడే అవకాశాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగడం వల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అయితే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, పొటాషియం శరీరంలో పేరుకుని, ప్రమాదకరమైన స్థాయికి చేరుకోవచ్చు. కొబ్బరి నీరులో పొటాషియం అధికంగా ఉండడం వల్ల, కొంతమంది కిడ్నీ రోగులకు ఇది మేలు కాకపోవచ్చు. హైపర్‌కలేమియా ఉన్నవారు కొబ్బరి నీరు తాగేటప్పుడు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది. క్రానిక్ కిడ్నీ డిసీజ్ : దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలతో బాధపడేవారు ద్రవ పానీయాల ) పరిమాణాన్ని నియంత్రించాలి. కొబ్బరి నీరులోని ఎలక్ట్రోలైట్లు, ముఖ్యంగా పొటాషియం అధిక స్థాయిలో ఉండడం వల్ల, అఐఆ ఉన్నవారికి ప్రతికూల ప్రభావం కలిగించే అవకాశం ఉంది. కాబట్టి, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో ఉన్న వారు కొబ్బరి నీరు త్రాగే ముందు వైద్యుని సంప్రదించడం మంచిది. కొబ్బరి నీరు రక్తపోటును కొంతవరకు నియంత్రించడంలో సహాయపడుతుంది. కానీ, అధిక సోడియం లెవల్స్ ఉన్నవారు, లేదా సోడియం పరిమిత ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉన్నవారు, కొబ్బరి నీరు త్రాగేముందు జాగ్రత్తగా ఉండాలి. ఎవరికి తాగొచ్చు? ఎవరికి తాగకూడదు? చిన్నపాటి మూత్రపిండ రాళ్లు ఉన్నవారు. సాధారణ మూత్రపిండ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారు. తక్కువ పొటాషియం స్థాయితో ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చు. అయితే హైపర్‌కలేమియా (అధిక పొటాషియం) ఉన్నవారు. క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఉన్నవారు. అధిక సోడియం నియంత్రణ అవసరమైన వారు కొబ్బరి నీరు తీసుకోకపోవడమే మంచిది.' మూత్రపిండాల సమస్య ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలి. కొబ్బరి నీరు ఆరోగ్యకరమైనదైనా, అది కొన్ని మూత్రపిండ సమస్యలలో ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. కాబట్టి, మీకు కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉంటే, ముందుగా వైద్య నిపుణుల సలహా తీసుకుని, అవసరమైన మార్గదర్శకత్వాన్ని పాటించడం ఉత్తమం.

# పరగడుపున ఈ ఆహారాలు అస్సలే తినొద్దు... తింటే జరిగేదిదే!

చాలామంది ప్రతిరోజూ ఉదయం నిద్ర లేచిన తర్వాత పరగడుపున ఏం తినాలి? ఏం తినకూడదు? అనేది తెలుసుకోకుండా ఆహారాన్ని తీసుకుంటారు. పరగడుపున తీసుకునే ఆహారం విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. ఒకవేళ జాగ్రత్తలు తీసుకోకుండా పరగడుపున ఏది పడితే అది తింటే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇక పరగడుపున మనం తినకూడని ఆహార పదార్థాలు ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. పరగడుపున ఈ ఆహారాలు తీసుకోకూడదు పరగడుపున మనం ఉప్పు, కారం, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. ఖాళీ కడుపుతో ఈ ఆహారాన్ని తీసుకుంటే గుండెల్లో మంటగా ఉంటుంది. ఇది మనకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఇక పరగడుపున మనం పుల్లగా ఉండే సిట్రస్ ఫ్రూట్స్ తీసుకోకూడదు. నిమ్మ, నారింజ వంటి వాటిని పరగడుపున తీసుకుంటే గ్యాస్ సమస్య వస్తుంది. ఉదయాన్నే ఈ పానీయాలు తీసుకోకూడదు చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీలు తాగుతూ ఉంటారు. పరగడుపున ఎలాంటి ఆహారం తినకుండా కాఫీ, టీలు తాగితే కూడా ఎసిడిటీ సమస్య వస్తుంది. అది మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పొరపాటున కూడా శీతల పానీయాలు తీసుకోకూడదు. వీటిలో ఉండే కార్బోనేటెడ్ గ్యాస్ మనకు పొట్ట ఉబ్బరాన్ని కలిగిస్తుంది. తీపి పదార్థాలు పరగడుపున తింటే జరిగేదిదే పరగడుపున పొరపాటున కూడా తీపి పదార్థాలు తీసుకోకూడదు. ఒకవేళ ఉదయం ఆహారంలో భాగంగా మొదట తీపి పదార్థాలు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి జీర్ణాశయంలో ఉన్న ఎంజైములు బద్ధకంగా మారుతాయి. దీనివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. పరగడుపున నూనెలో డీప్ ఫ్రై చేసిన ఆహారాలను తినకూడదు. వీటిని తినడం వల్ల నీళ్లను ఎక్కువ తాగడంతో పాటు పొట్ట ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. నిల్వ పచ్చళ్ళు, పాలపదార్థాలు తింటున్నారా? పొరబాటున కూడా పరగడుపున టిఫిన్ తో పాటు నిల్వపచ్చళ్ళు తీసుకోకూడదు. పచ్చళ్ళలో ఉప్పు, కారం, నూనె ఎక్కువగా ఉంటాయి. ఇవి మనకు గ్యాస్ సమస్యను, అజీర్తిని కలిగిస్తాయి. ఇక పరగడుపున చీజ్ వంటి ఆహారాలను తీసుకోకూడదు. చీజ్ లో కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల ఈ పాలపదార్థాలు పరగడుపున తింటే అజీర్తి సమస్య వస్తుంది. పరగడుపున పొరపాటున కూడా ఐస్క్రీమ్ ని తీసుకోకూడదు. ఇది మన జీర్ణవ్యవస్థను ఇబ్బంది పెడుతుంది. ఆరోగ్య సమస్యలు వచ్చే చాన్స్... జాగ్రత్త ఫ్యాట్ తో పాటు చక్కర శాతాన్ని ఇందులో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇది మనకు అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. ఇక పరగడుపున చాలా లైట్ గా సులభంగా జీర్ణమయ్యే ఆహారాలను తీసుకోవడం మంచిది. పైన పేర్కొన్న ఆహారాలను తీసుకొని అనారోగ్యాల బారిన పడకుండా ఎంపిక చేసుకున్న ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండడం మంచిది.



# బరువు పెరగటానికి ప్రధాన కారణాలివే.. తెలుసుకోండి!

చాలామంది ప్రస్తుతం అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఊబకాయ బాధితులు పెరిగిపోయారు. అసలు బరువు పెరగడానికి కారణాలేంటి? బాగా ఆహారం తీసుకునే వారే బరువు పెరుగుతారా? ఏ కారణాలతో బరువు పెరుగుతారు అన్నది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. మన జీవనశైలి కారణంగా మనం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. బరువు పెరగటానికి కారణాలివే తగినంత వ్యాయామాన్ని చేయకపోవడం, తక్కువ కదలడం, నిద్రలేమి వంటి సమస్యలు మన బరువు పెరగడానికి కారణాలుగా మారుతున్నాయి. అంతేకాదు అతిగా తినడం, తినకూడని ఆహారాలను తినడం, కార్బోహైడ్రేడ్లు ఎక్కువగా ఉన్న ఆహారాలను తినడం, శరీరానికి కావాల్సిన ప్రోటీన్ తీసుకోకపోవడం, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం మన బరువు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. హార్మోన్ మార్పులు కారణంగా బరువు పెరిగే అవకాశం కొంతమందిలో వయస్సు పెరిగే కొద్దీ జీవక్రియ మందగించి బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక మరికొంతమందిలో హార్మోన్ మార్పులు కారణంగా బరువు పెరిగే అవకాశం ఉంటుంది. హార్మోన్ల మార్పులు, పాలిసిస్టిక్ ఒవేరియన్ సింద్రోమ్, హైపోథైరాయిడిజం వంటివి కూడా మన బరువు పెరగడానికి ప్రధానమైన కారణాలుగా చెప్పవచ్చు. సరిగా నిద్ర లేకపోవడం మన బరువును అమాంతం పెంచేస్తుంది. మానసిక స్థితి కూడా బరువు పెరగటానికి కారణం విపరీతమైన పని ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, నిరాశ వంటి మానసిక స్థితి కూడా మన బరువు పెరగడానికి కారణమవుతుంది. కొంతమందిలో జెనెటికల్ గా తల్లిదండ్రుల నుండి వచ్చాయి. ఈ లక్షణాలు కూడా బరువు పెరగడానికి కారణం అవుతుంది. జనన నియంత్రణ మాత్రలు వేసుకోవడం, కార్డికో స్టెరాయిడ్స్ ను ఉపయోగించడం కూడా మన బరువు పెరగడానికి కారణం అవుతుంది. మధుమేహం చికిత్సకు ఉపయోగించే కొన్ని మందులు కూడా మన బరువును అమాంతం పెంచేస్తాయి. ఎక్కువ క్యాలరీలు తీసుకునే వారిలో మాత్రమే కాదు డైట్ పేరుతో సరైన సమయానికి సరైన ఆహారాన్ని తీసుకోని వారిలో కూడా బరువు పెరిగే సమస్య ఉంటుంది. శరీరంలోని అంతర్లీన పరిస్థితులు, శారీరక మార్పులు వంటివి కూడా బరువు పెరగడానికి కారణం అవుతాయి.



# షుగర్ పేషెంట్లు డయాబెటిస్ నియంత్రణ కోసం రోజుకు ఎన్నిసార్లు తినాలి? ఎలా తినాలి?



ప్రస్తుత సమాజంలో చాలామంది టైప్ టు డయాబెటిస్ తో, లేదా ప్రీ డయాబెటిస్ తో బాధపడుతున్నారు. ఇక అటువంటివారు డయాబెటిస్ ని కంట్రోల్ చేసుకోవడానికి ఎటువంటి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. రోజుకు వారు ఎన్ని సార్లు తినాలి? ఎలా తింటే వీరు రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ ను కంట్రోల్ లో ఉంచగలుగుతారు? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఆహారం ఇలా తీసుకుంటే షుగర్ కంట్రోల్ టైప్ టు డయాబెటిస్ తో బాధపడేవారు ప్రతిరోజు మూడుసార్లకు మించి ఆహారాన్ని తీసుకోవడంతో రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. 2018లో డయాబెటిస్ మరియు మెటబాలిజం జర్నల్ లో ప్రచురితమైన ఈటింగ్ త్రీ టైమ్స్ మే నాట్ బి ఆప్టిమల్ ఫర్ ఎవ్రీవన్ విత్ డయాబెటిస్ ఏ ర్యాండమైజ్డ్ కంట్రోల్డ్ ట్రయల్ అనే అధ్యయనంలో ఈ విషయం నిరూపించబడింది. డయాబెటిస్ బాధితులపై జరిపిన అధ్యయనం ఇక ఈ నేపథ్యంలో డయాబెటిస్ బాధితులు ఎన్ని సార్లు తినాలి అనే విషయాన్ని గమనించినట్లయితే..ప్రీ డయాబెటిస్, టైప్ టు డయాబెటిస్ తో బాధపడేవారు ఊబకాయం ఉన్న 47 మందిని మూడు పూటలా ఆహారం పెట్టి 12 వారాలపాటు గమనించారు. మరికొందరిని ఆరు పూటలా ఆహారం తినమని సూచించారు. ఇలా 24 వారాలపాటు వీరందరిని పరిశీలించగా ఎక్కువసార్లు తిన్నవారిలో మెరుగైన ఫలితాలు కనిపించినట్టు తేలింది. ఆరుసార్లు తిన్నవారిలో ఆకలి తగ్గినట్టు గమనించిన పరిశోధకులు అందరూ ఒకే మోతాదులో కేలరీలు తీసుకున్న క్రమంలో వీరి చెక్కర స్థాయిలు కూడా అదుపులో ఉన్నట్టు, మూడుసార్లు తిన్నవారితో పోలిస్తే ఆరుసార్లు తిన్నవారిలో ఆకలి వేయడం తగ్గిందని అధ్యయనంలో తేల్చారు. ఇలా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కంట్రోల్ లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## అందుకే పీఎస్ఎల్‌లో ఆడుతున్నా: ఇంగ్లండ్ స్టార్ బౌలర్

ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన లీగ్స్‌లో ఐపీఎల్ ఒకటి. అలాంటి క్యాచ్ రిచ్ లీగ్ కు వివిధ కారణాలతో కొందరు ప్లేయర్లు దూరంగా ఉంటుంటారు. ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ కూడా ఆ జాబితాలో చేరాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026 సీజన్‌కు అతడు దూరంగా ఉండి.. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో చేరాడు. అక్కడకరాచీ కింగ్స్ జట్టు తరఫున ఆడుతున్నాడు. ఈ క్రమంలో అతడిపై అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మొయిన్ అలీ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని.. తాను ఐపీఎల్‌ను కాదని పీఎస్ఎల్ ఆడటం వెనుక ఉన్న అసలు కారణాలను వెల్లడించాడు.'నాకిప్పుడు 38 ఏళ్లు. అయినప్పటికీ నేనింకా క్రికెట్ ఆడాలనే అనుకుంటున్నాను. వీలైనంతగా నా కెరీర్‌ను పొడిగించుకోవాలని భావిస్తున్నాను. నేను పాకిస్థాన్ సూపర్ లీగ్ ఎంచుకోవడానికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి. ఐపీఎల్ సుదీర్ఘంగా సాగుతోంది. అదే పీఎస్ఎల్ తక్కువ రోజుల్లో ముగిసే టోర్నీ. ఇది నా కుటుంబంతో గడపడానికి, అలాగే నా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి బాగా ఉపయోగ పడుతుంది. పీఎస్ఎల్ షెడ్యూల్ నాకు సరిగ్గా సరిపోతుంది" అని అన్నాడు.'గతేడాది నేను ఐపీఎల్‌లో ఆడాను. అయితే సగం మ్యాచ్‌లలో కూడా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. రెండుసార్లు మాత్రం నేను బ్యాటింగ్ చేసి ఉంటాను. నిజానికి నాకు బ్యాటింగ్ చేయడం ఇష్టం. నా కెరీర్ చివరి దశలోనూ ఎక్కువగా బ్యాటింగ్ చేయాలని కోరుకుంటున్నా. అయితే, ఆటను వీలైనంతగా ఆస్వాదించాలని భావిస్తున్నా. ఒక్కసారైనా పీఎస్ఎల్ ఆడాలని అనుకున్నా. కానీ.. దురదృష్టవశాత్తూ ఐపీఎల్‌తో పీఎస్ఎల్ షెడ్యూల్? క్లాష్ అవుతోంది. అందుకే ఈ సారి ఐపీఎల్‌కు దూరమయ్యాను" అని మొయిన్ అలీ తెలిపాడు.



## నటి తాన్యాపై పరువు నష్టం దావా వేసిన చాహల్.. ఎందుకంటే?

బాలీవుడ్ నటి తాన్యా ఛటర్జీపై టీమిండియా స్టార్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ పరువు నష్టం దావా వేశాడు. చాహల్ తనకు ఇన్‌స్టాలో ప్రైవేట్‌గా మెసేజ్‌లు పంపిస్తున్నాడంటూ తాన్యా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 'క్యూట్‌గా ఉన్నావ్' అంటూ చాహల్ తనకు నేరుగా మెసేజ్ చేసినట్లు స్క్రీన్ షాట్‌ను ఆమె మీడియాకు చూపించింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అయింది. ఈ నేపథ్యంలోనే తాన్యాపై చాహల్ పరువు నష్టం దావా వేసినట్టు తెలుస్తోంది.తాన్యా ఆరోపణల తర్వాత చాహల్‌పై నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దీంతో అతడి పీఆర్ టీమ్ ఆ వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించాలని కోరినట్టు తాన్యా పేర్కొంది. ఈ విషయంపై తాజాగా తాన్యా స్పందించింది. మెసేజ్ చేసిన చాహల్‌ను ఎవరూ ప్రశ్నించట్లేరని.. తనపై మాత్రమే ట్రోల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.'ఈ విషయం ఇంత వైరల్ అవుతుందని నాకు తెలియదు. నన్నే ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారు. పరువు పోయింది నాది. కానీ దానికి వ్యతిరేకంగా నా మీదే పరువు నష్టం దావా వేశారు. ఎందుకు యుజ్వేంద్ర చాహల్‌ను ఎవరూ ప్రశ్నించట్లేదు. నేను అతని వ్యక్తిత్వాన్ని తప్పు పట్టాలని అనుకోలేదు. నాకు చాహల్‌పై ఎంతో గౌరవం ఉంది' అని తాన్యా వెల్లడించింది.




## ఐపీఎల్ 2026: ఆర్సీబీతో పోరు.. టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్

ఐపీఎల్ 2026లో భాగంగా వీకెండ్ స్పెషల్ డబుల్ ధమాకా ఉండబోతోంది. నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడనున్నాయి. టాస్ నెగ్గిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత ఆర్సీబీ బ్యాటింగ్ చేయనుంది. గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నేడు ఆర్సీబీ ప్లేయర్లు గ్రీన్ జెర్సీలతో బరిలోకి దిగనున్నారు. ఇప్పటికే ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగు గెలిచిన ఆర్సీబీ.. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు ఆడిన నాలుగింట్లో రెండు మ్యాచులు గెలిచిన ఢిల్లీ.. ఆరో స్థానంలో ఉంది. నేటి మ్యాచ్‌లో ఆధిపత్యం ఎవరిదో చూడాల్సి ఉంది.విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్(కెప్టెన్), జితేశ్ శర్మ(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, హేజిల్‌వుడ్ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రసిక్ సలామ్ దార్, వెంకటేశ్ అయ్యర్, జోర్డాన్ కాక్స్, మంగేశ్ యాదవ్, విక్కీపాతుమ్ నిశాంక, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), సమీర్ రిజ్వీ, అక్షర్ పటేల్(కెప్టెన్), డేవిడ్ మిల్లర్, స్టబ్స్, ఆకిబ్ నబి దార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, టి నటరాజన్, ముకేశ్ కుమార్ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: విప్‌రాజ్ నిగమ్, అశుతోశ్ శర్మ, కరుణ్ నాయర్, దుశ్మంత్ చమీరా, నితీశ్ రాణా





## ఔటయ్యాననే కోపంతో షాహీన్ అఫ్రిది చేసిన పనికి అందరూ షాక్!

పాకిస్థాన్ సూపర్ లీగ్2026లో లాహోర్ ఖలందర్స్ కెప్టెన్ షాహీన్ షా అఫ్రిది చేసిన పని అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అతడు ఏదో చేద్దామని భావించి.. ముందుగా బ్యాటింగ్ వచ్చి డకౌట్ అయ్యాడు. దీంతో పరువు పోయిందని భావించిన అఫ్రిది సహనం కోల్పోయి.. బ్యాట్‌తో బౌండరీ లైన్ వద్ద ఉన్న టైర్లను బలంగా కొట్టాడు. ఈ ఘటన ప్రస్తుతం పీఎస్ఎల్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...పీఎస్ఎల్ 2026 భాగంగా క్వెట్టా గ్లాడియేటర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో లాహోర్ ఖలందర్స్ ఓటమి పాలైంది. షాహీన్ షా అఫ్రిది కెప్టెన్‌గా ఉన్న ఈ జట్టుకు ఇది నాలుగో ఓటమి కావడం గమనార్హం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లాహోర్ 19.5 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. లాహోర్ ఇన్నింగ్స్‌లో హసీబుల్లా ఖాన్( 33) మినహా మిగితా బ్యాటర్లందరూ విఫలమయ్యారు. అయితే ఈ మ్యాచ్‌లో షాహీన్ షా అఫ్రిది తన సహనాన్ని కోల్పోయాడు. క్వెట్టా గ్లాడియేటర్స్ బౌలర్ల ధాటికి 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో జట్టును గట్టెక్కించేందుకు అఫ్రిది తనను తానుగా ప్రమోట్ చేసుకుని ముందుగా బ్యాటింగ్‌కు వచ్చాడు.స్టార్ ఆల్ రౌండర్లు సికిందర్ రజా, డానియల్ సామ్స్‌ను కాదని అఫ్రిది ముందుగా బ్యాటింగ్ రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే షాహీన్ తాను ఆడిన తొలి బంతికే స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో గోల్డెన్ డకౌటైన బాధలో షాహీన్ అసహనానికి గురయ్యాడు. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లే క్రమంలో బౌండరీ లైన్ దగ్గర ఉన్న టైర్లను బ్యాట్‌తో బలంగా బాదాడు. అంతేకాకుండా మెట్లకు కూడా తన బ్యాట్‌ను బలంగా కొడుతూ ముందుకు వెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఏదో పెద్ద ఘనతను చేజార్చుకున్నట్లుగా ఇంత ఓవరాక్షన్ ఎందుకంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## బౌలింగ్ మార్కర్‌ను విసిరేశాడు.. తీవ్ర వత్తిడిలో బుమ్రా..



ముంబై: ముంబై ఇండియన్స్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ సీజన్‌లో ముంబై జట్టు వరుస ఓటములు ఎదుర్కుంటోంది. ఇప్పటి వరకు బుమ్రా ఈ సీజన్‌లో ఒక్క వికెట్ కూడా తన ఖాతాలో వేసుకోలేదు. అయితే ఆ ఫ్రస్టేషన్ బుమ్రాలో కనిపించింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు తెలిసిపోయింది. ఓ దశలో బౌలింగ్ మార్కర్‌ను బుమ్రా విసిరేశాడు. ఆవేశాన్ని తట్టుకోలేక బౌలింగ్ మార్కర్‌ను విసిరేసినట్లు ఆ వీడియో ద్వారా అర్థమవుతోంది. ఈ ఘటనకు చెందిన ఓ ప్రైవేటు వీడియో రిలీజైంది. బౌలింగ్ మార్కర్‌ను విసిరేసి చాలా ఆగ్రహంగా అరిచినట్లు కూడా ఆ వీడియోలో ఉన్నది. అలాగే గ్రౌండ్‌లోనే ఉన్న మరో మార్కర్‌ను కూడా తన కాళ్లతో గట్టిగా తన్నాడు.బుమ్రా తీవ్ర అసహనంతో ఉన్న సమయంలో.. క్రీజ్‌లో టిమ్ డేవిడ్ బ్యాటింగ్ చేస్తున్నట్లు ఆ వీడియోలో కనిపించింది. ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ 240 రన్స్ చేయగా, ముంబై కేవలం 222 రన్స్ మాత్రమే చేసి ఓటమిపాలైంది. అయితే ఆ మ్యాచ్‌లో బుమ్రా తన 4 ఓవర్లలో 35 రన్స్ ఇచ్చాడు. కానీ వికెట్ తీయలేకపోయాడు. బుమ్రా తాను ఆడిన 5 మ్యాచుల్లో ఒక్క వికెట్ కూడా తీయకపోవడం వల్ల ఫ్రస్టేషన్‌కు గురై ఉంటాడని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. బౌలింగ్ మార్కర్‌ను విసిరేసిన బుమ్రాపై ఐపీఎల్ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## ఐపిఎల్ 2026: టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ




బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగు మ్యాచుల్లో గెలిచి టేబుల్‌లో రెండో స్థానంలో ఉన్న ఆర్‌సిబి.. ఈ మ్యాచ్‌లో గెలిచి టేబుల్ టాప్‌లోకి వెళ్లేందుకు ఆశపడుతోంది. మరోవైపు వరుసగా రెండు ఓటములను చవిచూసిన ఢిల్లీ ఈ మ్యాచ్‌లో గెలవాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు గత మ్యాచ్‌లోని జట్టు సభ్యులతోనే బరిలోకి దిగుతున్నాయి. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, దేవ్‌దత్ పడిక్కల్, రజత్ పాటిదర్ (కెప్టెన్), జితేశ్ శర్మ (కీపర్), టిమ్ డేవిడ్, రోమిరియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ, జోష్ హేజిల్‌వుడ్. డిసి: పాతుమ్ నిస్సాంక, కెఎల్ రాహుల్(కీపర్), సమీర్ రిజ్వి, అక్షర్ పటేల్(కెప్టెన్), డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, ఆకిబ్ నబీ దార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, టి నటరాజన్, ముఖేశ్ కుమార్.

## 'సర్పంచ్'కి అర్థం తెలియక అయోమయంగా అనిపించేది: శ్రేయస్ అయ్యర్

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆడిన అన్ని మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను అభిమానులు, సహచర ఆటగాళ్లు 'సర్పంచ్ సాబ్' అంటూ పిలుస్తారన్న విషయం తెలిసిందే. పంజాబ్ కింగ్స్ జట్టులో చేరిన తర్వాతే అయ్యర్‌కు ఈ నిక్‌నేమ్ పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రేయస్ ఆ ట్యాగ్ గురించి వివరించాడు. మొదట్లో సర్పంచ్‌కు అర్థం తెలియక అయోమయంగా అనిపంచేదని, మీనింగ్ తెలుసుకున్న తర్వాత స్పష్టత వచ్చిందని తెలిపాడు.'నాకు 'సర్పంచ్' అనే పదం బాగా నచ్చింది. పంజాబ్ కింగ్స్‌తో ప్రయాణం మొదలైనప్పుడు ఇలా ఎందుకు పిలిచారో కూడా తెలియదు. గందరగోళంగా అనిపించేది. అప్పుడే సహచరులను అడిగా. సర్పంచ్ అంటే ఏంటో వారు వివరించారు. కుటుంబం, ఒక గ్రూప్, లేదా ఊరు.. ఇలాంటి వాటికి పెద్దగా వ్యవహరించేవారినే సర్పంచ్ అంటారని తెలిసింది. అప్పటినుంచి 'సర్పంచ్' నా ప్రయాణంలో భాగమైంది. నాకెంతో ఇష్టమైన నిక్‌నేమ్‌గా మారిపోయింది' అని శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు.గతేడాది పంజాబ్ కింగ్స్ సారథిగా వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చిన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో అయ్యర్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో 203 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్‌లో 14 సిక్సులు, 14 ఫోర్లు ఉన్నాయి.






# వెంకీతో త్రివిక్రమ్.. రైల్వేస్టేషన్ లో ప్లాన్ ఏంటి?



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఈ ఇద్దరి కాంబినేషన్ అంటేనే ఒక వింటేజ్ వైబ్ గుర్తొస్తుంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకి త్రివిక్రమ్ రాసిన మాటలు వెంకీ టైమింగ్‌లో ఎలా పేలాయో మనందరికీ తెలుసు. అయితే ఈసారి కేవలం రైటర్ గానే కాకుండా, వెంకటేష్ 77వ సినిమాకి త్రివిక్రమ్ డైరెక్షన్ కూడా చేస్తుండటంతో అసలు మ్యాటర్ నెక్స్ట్ లెవల్‌కి వెళ్ళింది. లేటెస్ట్ గా 'ఆదర్శ కుటుంబం' ఎఐ47 షూటింగ్ సెట్స్ నుంచి వచ్చిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. ఈ లేటెస్ట్ అప్‌డేట్‌లో ఒక రైల్వేస్టేషన్ సెట్ కనిపిస్తోంది. పక్కనే ట్రైన్ ఉండగా, వెంకీతో త్రివిక్రమ్ ఏదో సీరియస్ గా ముచ్చట్లు పెడుతున్నట్లు ఆ ఫోటోలో ఉంది. ఇది చూస్తుంటే, సినిమాలో రైల్వేస్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో ఏదో ఒక ఇంట్రెస్టింగ్ సీన్ ఉండబోతోందని అర్థమవుతోంది. త్రివిక్రమ్ సినిమాలో స్టేషన్ సీన్లు అంటేనే ఒక వేల్యూ ఉంటుంది. మరి వెంకీతో ఆయన ఏ రకమైన మ్యాజిక్ ప్లాన్ చేస్తున్నారో చూడాలి. చాలా కాలం తర్వాత త్రివిక్రమ్ మళ్ళీ తన మార్కు ప్యూర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఫోకస్ పెట్టారు. 'ఆదర్శ కుటుంబం' అనే పేరు వింటేనే, ఇది పక్కా మధ్యతరగతి ఇంటి కథ అని, అందులో త్రివిక్రమ్ మార్క్ పంచులు, వెంకటేష్ మార్క్ అల్లరి ఉండబోతున్నాయని క్లారిటీ వస్తోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో వెంకీ తర్వాతే ఎవరైనా. ఇక త్రివిక్రమ్ కాంటెంట్ క్లిక్కయితే బాక్సాఫీస్ వద్ద పాత రికార్డులు బద్దలవ్వడం ఖాయం. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, హారిక అండ్ హాసిని బ్యానర్‌పై రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ రైల్వేస్టేషన్ ఫోటోతో సినిమా మూడ్ ఏంటో చెప్పకనే చెప్పేశారు. గతంలో త్రివిక్రమ్ రాసిన సినిమాల్లో వెంకీ తన నటనతో ఒక రేంజ్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు ఏకంగా త్రివిక్రమ్ డైరెక్షన్‌లోనే పనిచేస్తుండటంతో, మనందరికీ నచ్చిన ఆ 'ఓల్డ్ వెంకీ మామ' మళ్ళీ స్క్రీన్ పై కనిపిస్తాడని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ సెట్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్ సినిమాకి చాలా కీలకం అని టాక్. త్రివిక్రమ్ సాధారణంగా సెట్స్‌లో చాలా కూల్‌గా ఉంటూ సీన్లను డెవలప్ చేస్తుంటారు. ఈ ఫోటోలో కూడా ఆ క్రియేటివ్ వైబ్ కనిపిస్తోంది. పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్న ఆడియన్స్‌కి ఈ 'ఆదర్శ కుటుంబం' ఒక మంచి ట్రీట్ అయ్యేలా ఉంది. ఇక మొదటి టీజర్ ఎప్పుడు వస్తుందో చూడాలి. సినిమాను అయితే ఇదే ఏడాది సమ్మర్ తరువాత విడుదల చేయాలని అనుకుంటున్నారు.



# సమంత కెరీర్ గ్రాఫ్..గ్యాప్!



ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించు కున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం , ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్‌తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న అమ్మడు అటుపై తన కెరీర్ పంథాను మార్చుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. యశోద, శాకుంతలం వంటి ప్రయత్నాలు ఆ కోవలోకి చెందినవే అయినా అవి ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. గత మూడేళ్ల కాలంలో సమంత కెరీర్ గ్రాఫ్‌లో స్పష్టమైన గ్యాప్ కనిపిస్తోంది. ఆమె తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' వంటి సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి , వృత్తికి మధ్య సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీ కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.

# హ్యారీస్ జైరాజ్ మార్క్ ఎక్కడా కనిపించడం లేదే!



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో హ్యారీస్ జైరాజ్ పేరు ఒక సంచలనం. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజాల తర్వాత ఆ స్థాయి మెలోడీలను, ట్రెండీ మ్యూజిక్‌ను అందించగల సత్తా ఉన్న ఏకైక సంగీత దర్శకుడిగా హ్యారీస్ గుర్తింపు పొందారు. వాసు, ఘర్షణ, ఆరెంజ్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఓ ఊపు ఊపిన హ్యారీస్ తనకంటూ ఓ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు. కానీ గత కొంతకాలంగా ఆ మార్క్ బాక్సాఫీస్ వద్ద గానీ, చార్ట్‌బస్టర్లలో గానీ ఎక్కడా కనిపించకపోవడం సంగీత ప్రియులను విస్మయానికి గురిచేస్తోంది. హ్యారీస్ జైరాజ్ సంగీతంలో వైవిధ్యం కంటే ఒకే రకమైన సౌండింగ్ వినిపిస్తోందనే విమర్శలు ఆయన మార్కెట్‌ను దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రతి పాటలోనూ కొత్తదనం చూపించిన ఆయన క్రమంగా తన పాత ట్యూన్లనే రీసైకిల్ చేస్తున్నారనే భావన శ్రోతలలో కలిగింది. దీనికి తోడు ప్రస్తుతం మ్యూజిక్ ఇండస్ట్రీలో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ ,భారీ మాస్ బీట్స్ ట్రెండ్ నడుస్తోంది. హ్యారీస్ బలం మెలోడీ కావడం, ప్రస్తుత కమర్షియల్ సినిమాలకు కావలసిన ఇన్‌స్టంట్ ఎనర్జీని ఆయన అందించలేకపోవడం వల్ల వెనుక బడ్డారా? అన్న సందేహాలు లేకపోలేదు. ఒకప్పుడు సూర్య, విక్రమ్, హ్యారీస్ జైరాజ్ కాంబినేషన్ అంటే కనీసం ఆరు నెలల ముందు నుండే పాటల కోసం అభిమానులు వేచి చూసేవారు. కానీ ఇప్పుడు స్టార్ హీరోల దృష్టి అంతా అనిరుధ్ రవిచందర్ , థమన్ వంటి యువ సంగీత దర్శకులపై పడింది. బిగ్ బడ్జెట్ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు హ్యారీస్ చేతి నుండి జారిపోవడంతో ఆయన మార్కెట్ పైనా ప్రభావం చూపిస్తోంది . స్టార్ హీరోలతో నిరంతరం పని చేసిన ఆయన ఇప్పుడు యువ హీరోల సినిమాలకే పరిమితం కావాల్సి రావడం గమనార్హం. మారిన సాంకేతికతను , ప్రేక్షకుల అభిరుచులను అందిపుచ్చుకోవడంలో హ్యారీస్ కొంత నెమ్మదించారని విమర్శలు లేకపోలేదు. అనిరుధ్ వంటి వారు సోషల్ మీడియా ట్రెండ్స్‌కు తగ్గట్లుగా సాంగ్స్ కంపోజ్ చేస్తుంటే, హ్యారీస్ ఇంకా పాత పద్ధతులకే కట్టుబడి ఉండటం ఆయనకు మైనస్‌గా మారిందంటున్నారు. కేవలం ఒక వర్గం ప్రేక్షకులను మాత్రమే అలరించేలా ఆయన సంగీతం ఉండటం వల్ల, మాస్ ప్రేక్షకులకు ఆయన దూరమవుతున్నారన్నది కొందరి అభిప్రాయం. ఇది ఆయన కెరీర్ గ్రాఫ్‌ను అగ్రస్థానం నుండి కిందికి దించుతున్నట్లే ఉంది. అయినా హ్యారీస్ జైరాజ్ ప్రతిభను తక్కువ అంచనా వేయలేం. ఒక గొప్ప కంబ్యాక్ ఇవ్వడానికి ఆయనకు కావాల్సింది కేవలం ఒక సరైన దర్శకుడు, మంచి కథ మాత్రమే. గౌతమ్ మీనన్, శంకర్ లాంటి దర్శకులతో ఆయన పని చేసినప్పుడు వచ్చిన అవుట్‌పుట్ మళ్ళీ రిపీట్ అయితే? హ్యారీస్ మ్యాజిక్ మళ్ళీ మొదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న చిన్న సినిమాలు సంగీత పరంగా హిట్ అయితే? తిరిగి పెద్ద ప్రాజెక్టులు ఆయన తలుపు తట్టే అవకాశం లేకపోలేదు. సినీ పరిశ్రమలో మార్పు అనేది సహజం. నిన్న ఉన్న క్రేజ్ నేడు ఉండకపోవచ్చు.

# కరుప్పుపై సడన్ ట్విస్ట్.. డైరెక్టర్ మాటలకు ఫ్యాన్స్ షాక్!

: సూర్య అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'కరుప్పు' సినిమా మే 14న విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు ఆర్జే బాలాజీ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి సంచలన విషయాలు పంచుకున్నారు. ఇది భక్తి సినిమా అని అందరూ అనుకున్నారు కానీ, నిజానికి ఇదొక మాస్ సూపర్ హీరో ఫిల్మ్ అని క్లారిటీ ఇచ్చారు. లోకంలో కష్టాలు పెరిగిపోయినప్పుడు, వాటిని అంతం చేయడానికి ఒక వీరుడు ఎలా వచ్చాడనే పాయింట్‌తో ఈ సినిమాను చాలా పవర్‌ఫుల్‌గా తెరకెక్కించారట. చాలా కాలంగా 'కరుప్పు' అంటే ఆర్జే బాలాజీ గత చిత్రం 'మూకుత్తి అమ్మన్' లాగే దైవత్వంతో కూడిన సినిమా అని అందరూ భావించారు. కానీ దర్శకుడు ఈ అంచనాలను తలకిందులు చేశారు. "ఇది భక్తి సినిమా కాదు, ఒక కష్టకాలంలో లోకాన్ని రక్షించడానికి వచ్చే సూపర్ హీరో కథ" అని ఆయన స్పష్టం చేశారు. కరుప్పసామి అనే పేరులో ఉన్న పవర్, ఆ క్యారెక్టరైజేషన్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం క్లాస్ ఆడియన్స్‌నే కాకుండా, బి, సి సెంటర్స్ లోని మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ సినిమాను రూపొందించారు. సూర్య పవర్ ఫుల్ కమ్‌బ్యాక్: గతంలో వచ్చిన 'కంగువ', 'రెట్రో' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో, సూర్యకు ఈ సినిమా విజయం చాలా కీలకం. ఈ చిత్రంలో సూర్య పాత్ర ప్రయాణం చాలా ఎమోషనల్‌గా, అదే సమయంలో అత్యంత శక్తివంతంగా సాగుతుందట. ఒక సామాన్యుడు అసామాన్యుడిగా ఎలా ఎదిగాడు, సమాజంలోని చెడును ఎలా ఎదురించాడు అనే అంశాలను ఆర్జే బాలాజీ చాలా మాస్ స్టైల్‌లో ప్రెజెంట్ చేశారు. ఇక ప్రమోషన్స్‌లో వినిపిస్తున్న మాటలను బట్టి చూస్తే, సూర్య తన విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నారని అర్థమవుతోంది. స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటే బాక్సాఫీస్ షేకే!: సోషల్ మీడియాలో సూర్య ఫ్యాన్స్ ఈ అప్‌డేట్స్‌తో ఫుల్ ఖుషీగా ఉన్నారు.



సినిమా కాన్సెప్ట్ వినడానికి చాలా కొత్తగా ఉండటంతో, మంచి స్క్రీన్ ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని వారు నమ్ముతున్నారు. ఇక ముఖ్యంగా కరుప్పసామి వంటి పవర్‌ఫుల్ టైటిల్ కనెక్టివిటీ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సినిమాకు భారీ ఆదరణ లభించే అవకాశం ఉంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ఇంటర్వ్యూలు సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లాయి. కేవలం ఫైట్లు మాత్రమే కాకుండా, కథలో ఉన్న గ్రిప్పింగ్ పాయింట్స్ అందరినీ ఆకట్టుకుంటాయని టాక్. మే 14న అసలైన వేట మొదలు: ఎన్ని ఆలస్యాలు జరిగినా 'కరుప్పు' క్రేజ్ మాత్రం తగ్గలేదు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**